# కమ్మ తెమ్మెర

"అటు సన్నాయి మేళంలో వినతాసుతవాహనుడై కాంచీ వరదుడు బయల్దేతుండగా, యిటు రికాబులో కాలుపెట్టి, కళ్ళాన్ని బిగపట్టి, చివాలున పైకెగిరి, గుర్రంపైన కూర్చున్నాడు శేషాద్రి. మున్నెన్నడూ చేసి చూడని పని! శేషాద్రి కాస్త తబ్బిబ్బు పడిన మాట నిజం, కానీ అది తొట్రుబాటుకి సమయం కాదని శేషాద్రికి తెలుసు. వెయ్యి కళ్ళు తనవైపు పరకాయించి చూస్తున్నాయి. తనలోని ప్రతి కదలికకూ ఎక్కడలేని ప్రాదాన్యం వచ్చిపడిన ఈ విచిత్ర పరిస్థితిలో తనెంత జాగ్రత్తగా వుండ గలిగితే అంత మంచిది....

సర్దుకుని చక్కగా కూర్చున్నాడు శేషాద్రి. వీలున్నంతలో ఠీవిగానే కూర్చో గలిగామన్న నమ్మకం కలిగిన తరువాత, అత డొకసారి తన చుట్టూరా కలయ పరికించాడు. ఎట్ట ఎదుట మేళం మ్రోగుతోంది. ఆ మేళంలో ప్రత్యేకించి చెప్పుకోదగిన ముఖ్యాంశం డోలు. మేలు మేలు! అది డోలు కాదు - శివతాండవాన్ని చూస్తూ పరవశుడైతలాడిస్తున్న నందీశ్వరుడి గంగడోలు! మెడలోని బంగారపు గొలుసు జిగేల్ జిగేల్మని మెరుస్తుండగా, పైకెగిరి, పాయలుగా చీలి, సుళ్ళు తిరిగి రకరకాలుగా రోజుకుంటూ గిరిజాలు పున్నమనాటి సముద్ర తరంగాల్లా కల్లోల పడుతుండగా ఆ డోలు వాద్యగాడు మనసిచ్చి, లాలించి బుజ్జగించి బుగ్గలు చుంబించి, అంతలో మూతి బిగించి, నుదురు చిట్లించి పెడముఖం పెట్టి సాదించి, చిట్టచివరకు ఉపాయాంతరం లేక దాసోహ మన్నట్టుగా తల వంచి పెళ్ళాన్ని ఏలుకోవడంలో వున్న వెయ్యి ఒడుపుల్ని తన వాద్య విద్య మూలంగానే విశదీకరిస్తున్నాడు. ఒక్కుమ్మడిగా పెళ్ళి కొడుకును అభిషేకిందచవలసిన చూపుల్ని తనవైపుకు మళ్ళించు కుంటున్నందుకు డోలు వాద్యగాడి పైన కోప్పడుతూ, అతడు ముక్తాయింపులు ముగించగానే నాదస్వరాలు పైకెత్తి, శేషాద్రిని నిర్దేశించి 'అందరూ ఈవైపే చూడాలి! ఇతడే పెళ్ళికొడుకు' అని మేళగాళ్ళ హెచ్చరికలు ధ్వనిస్తున్నాయి. మేళం చుట్టూ నిల్చుని సంగీత రసాస్వాదనలో ఒళ్ళు మరచిన రసికులు కొందరు తమకు తలా ఒక డోలూ, నాదస్వరమూ లేని కొరతను చిటికెలు వేయడం మూలంగా, తల పంకించడం మూలంగా సర్దుబాటు చేసుకుంటున్నారు. పెళ్ళి కుమారుడి వెనుక వైపున పట్టు చీరలు కట్టుకున్న పెద్ద ముత్తయిదువుల దగ్గరినుంచీ, పరికిణీలు కట్టి ఓణీలు వేసుకున్న కన్నెపడుచుల వరకూ వివిధ వయోరూపలావణ్యాలతో ఒప్పారుతున్న తన్వంగులు ఈ వూరేగింపునే గాదు, ధరిత్రి చరిత్రను సైతం ముందుకు నడిపిస్తున్నది మేమే నన్నంత ధీమాతో, మత్తేభాలతో పోటీ పడుతూ, మరాళాలకు సవాళ్ళు విసురుతూ అడుగులు కదిలిస్తున్నారు.....

దొంగ చూపులతో తన వైపోసరి చూచుకున్నాడు శేషాద్రి. ఫరవాలేదు! తను గూడా ఏమంత నాసి రకం పెళ్ళికొడుకులా లేడు. చెంగులు జీరాడుతున్న పంచకట్టు. మిసమిస లాడుతున్న

సిల్కులాల్చీ. కుడిభుజం పైనుంచి క్రిందకి తీసి ఎడమ వైపున ముడివేసిన పట్టు సెల్లా, మెడలో పుష్పహారం! తనకేం, లక్షణంగా ఉన్నాడు. ఈ పోజులో తనను ఫోటో తీస్తే, ఆ ఫోటోలో తను పుర వీధుల్లో వూరేగుతున్న పిన్నపాళే గాడిలా ఉంటాడు!

శేషాద్రి మళ్ళీ తల పైకెత్తాడు. బారులు తీర్చి నిల్చున్న మంటి మిద్దెల మధ్య పెట్రోమాక్సు లైట్ల వెలుగు వెల్లువల్లో పెళ్ళి వూరేగింపు పూల తెప్పలా సాగిపోతోంది.

శేషాద్రి పెదవుల పైన లీలగా ఓ చిరునవ్వు తటిల్లతలా మెరసి తటాలున మాయమైంది. ఇదేదో నడిమంతరపు సిరిలా ఉంది.

కాకపోతే ఒకరోజు రాచరికం లాంటి దనుకోవచ్చు. మూడు ముళ్ళుపడి ముహూర్తం ముగిసేదాకా తనకు రాజమర్యాదలు జరుగుతాయి. షోడశోపచారాలు సమకూరుతాయి. కోరితే కొండమీది కోతైనా క్రిందికి దిగివస్తుంది. ఒరే శేషాద్రీ అంటూ చనువుగా కొందరు, ఇదిగో నాయనా శేషూ అంటూ ముద్దుగా కొందరు, ఇంకా రకరకాల వావి వరుసలతో మరికొందరు - వీళ్ళందరూ తనను పీటపైన కూర్చోబెట్టి సంసార సామ్రాజ్యానికి యౌవరాజ్య పట్టాభిషేకం కట్టి, ఎవరి దారిన వాళ్ళు చక్కా వెళ్ళిపోతారు!

అంతవరకూ బాగానే ఉంది. కానీ ఆ తరువాత?

అర్ధాంగి అనుకూలవతి అయితే సంసారం స్వర్గ సుఖాలకు ఆవాస మవుతుంది. కానైతే అందుకు ప్రతికూలంగా జరగదని మాత్రం పూచీ ఏముంది?

అందుకే మరి ఎవడో లోకజ్ఞుడు వివాహాన్ని లాటరీతో ఉపమించాడు.

శేషాద్రి ఈ విషయంలో లోకోక్తి అక్షరాలా నిజమనిపిస్తుంది. ఎందుకంటే పెళ్ళిచూపుల మిషతోనైనా అతడొకసారి తన జీవితంతో పాలు పంచుకోనున్న అమ్మాయిని చూసే అవకాశాన్ని గోల్పోయాడు. పార్సెలు అంద చందాలనుబట్టి అందులోని వస్తువు ఎలాంటిదో తెలుసుకోడానికి ప్రయత్నించడం శుద్ధ తెలివి తక్కువనుకున్నాడు. లౌకిక జ్ఞానానికి సంబంధించినంత వరకూ తనకంటే ఏడాకులు ఎక్కువగా చదివిన తల్లి ఈ సంబంధం పట్ల మొగ్గు చూపింది గనుక, తాను ప్రత్యేకంగా అమ్మాయిని చూడవలసిన అవసరం లేదనీ, ఆ సంబంధం తనకు ముమ్మాటికీ నచ్చినట్టేనని నిక్కచ్చిగా తేల్చి చెప్పేశాడు.

"హవురా శేషాద్రీ! నువ్వెంతవాడి వయ్యావురా నాయనా! అంతా నా యిష్ట ప్రకారమే జరిగితే ఆ తరువాత నీ పెళ్లానికి అత్త పోరుండదనే గదూ నీ పథకం!" అంటూ విస్తుపోయింది పార్వతమ్మ.

"మరి నేను పుట్టింది ఎవరి కడుపులోనే అమ్మా!" అన్నాడు నవ్వుతూ శేషాద్రి.

సన్నాయి మేళంలో సాటిలేని రీతిగా కల నిజమై మది కెంతో హాయిగా కోరిక తీరుతుండగా జాగ్రత్తగా గుర్రం దిగి నాలు గడుగులు ముందుకు వేసిన శేషాద్రి 'కుడికాలు, కుడికాలు' అంటూ వెనకవైపు నుంచి వినవచ్చిన కేకను విని హఠాత్తుగా ఆగిపోయాడు.

ఆగిపోయిన శేషాద్రి తన కుడికాలు ఒకసారి జాడించి చూచుకున్నాడు గూడా! అది పదిలంగానే ఉంది.

"అది కాదురా శేషాద్రీ! మొదట కుడికాలు పెట్టాలి" అంటూ ఓ ముసలాయన ముందుకొచ్చాడు.

"ఓహో అదా! చంపేశావుపో బాబాయ్....?" అన్నాడు శేషాద్రి.

"శుభమా అని పెళ్ళి చేసుకుంటూ అదేం మాటరా నాన్నా! రక్షించావుపో అనాలి...." అన్నాడు

శేషాద్రి బాబాయి.

ఒకటి రెండు క్షణాల పాటు ఆ మాట నిజమే కాబోలు ననుకున్నాడు శేషాద్రి. సమయానికి ఆపద్బాంధవుడిలా బాబాయి హెచ్చరించాడు కాబట్టి సరిపోయింది గానీ లేకుండా ఏమై ఉండేది? మనిషి కున్నవి రెండంటే రెండే పాదాలు గనుక, వాటిలో ఏదో ఒకటి కదిలించకపోతే నడక సాగదు గనుక తను ఎడమ పాదం మోపినా మోపి ఉండవచ్చు. మోపితే ఏమై ఉండేది? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లభించదు. లేదంటే అనుమానానికి జవాబుగా వెయ్యి అనుమానాలు స్ఫురిస్తాయి.

శేషాద్రికి చాదస్తా లంటే గిట్టవు. ఉదయం లేచింది మొదలు, రాత్రి పడుకునే వరకు అడుగడుగునా ప్రతి కార్యకలాపానికి ఎదురయ్యే మూఢ విశ్వాసాలను జాతి జీవనంలో నుంచే పెకలించి వేయాలని శేషాద్రి కలలు నేవాడు. అవకాశం దొరికినప్పుడు సభల్లో ఉపన్యసించేవాడు గూడా.

మాటల కోటలు దాటుతాయి కానీ కాళ్ళు గడపదాటవంటారు. ఆ మాట శుద్ధ అబద్ధం. ఎందుకంటే శేషాద్రి కాళ్ళు అవలీలగా గడపను దాటేశాయి. ఆ దాటడంలో ప్రయత్న పూర్వకంగా నేతేనేమి అప్రయత్నంగా నైతేనేమి మొట్టమొదట అతని కుడిపాదమే మామగారింటిని పావనం జేసింది.

పచ్చివాసనలు వీస్తున్న పచ్చని కొబ్బరి మట్టల పందిరి క్రిందనుండీ నడిచివెళ్ళి, నట్టింట్లో తనకోసం పరిచిన చాపపైన కూర్చున్నాడు శేషాద్రి. పనుల తొందర మూలంగా అంతవరకూ పెళ్ళికొడుకును చూడలేకపోయిన ఆడపెళ్ళి వారు ఒక్క పెట్టున శేషాద్రి చుట్టూ మూగిపోయారు. వీధిలోనుంచీ పందిరి క్రిందికి వినవచ్చిన వాద్యఘోష తాకిడికి, చాపలపైన పడుకుని నిద్రపోతున్న పసికూనలు ఉలికిపడి లేచి కూచుని రాగాలాపన ప్రారంభించేశారు. శేషాద్రి కూర్చున్నచోట గాలి కదలడం లేదు. కనిపించిన ప్రతి ముఖమూ కొత్త ముఖం కావడం వల్ల నైతేనేమి, అందరూ తన వైపు పరిశీలనగా చూస్తుండడం వల్ల నైతేనేమి మానసికంగా గూడా ఉక్కిరిబిక్కిరై పోసాగడు.

నిమిషాలు దొర్లిపోతున్నాయి. అక్కడ తనెంత సేపలా నిశ్చలంగా కూర్చోవాలో శేషాద్రికి తెలిసి రావడండలేదు. ఎంతగా తను నిర్లిప్తంగా ఉండడానికి ప్రయత్నించినా, సుముహూర్తం దగ్గరించిన కొద్దీ తన పని ముళ్ళపైన కూర్చున్నట్టుంది. పెళ్ళికూతురు కనిపించేదాకా తన పరిస్థితి యిలాగే ఉంటుందేమో! ఐనా తొందరపడి లాభమేముంది? తపోదీక్ష సాంగోపాంగంగా పరిపూర్తి అయితే కానీ యిష్టదేవత ప్రత్యక్షం గాదు.

గడియారం చూచుకున్నాడు శేషాద్రి. గంట పది కావస్తోంది.

పదిన్నరకల్లా భోజనాలు వడ్డించేశారు. చివరి పంక్తి లేచేపరికి పన్నెండు దాటింది.

భోజనానంతరం భుక్తాయాసమైనా తీరక మునుపే శేషాద్రిని తీసుకెళ్ళి నలుగులకు కూర్చోబెట్టారు. చెంపలకూ, చేతులకూ గంధంపూసి, పన్నీటి జల్లులో ముంచి లేవనెత్తారు. చల్లచల్లగా చలిగాలి వీస్తున్న ఆ అర్ధరాత్రి సమయాన ఈ నలుగుల తతంగం శేషాద్రి కేమంత సుఖావహంగా లేదు. ఐనా అతడు పెదవి కదపకుండా, కదలని పెదవిపైన మందహాసం చెదరకుండా అక్కడ తన పాత్రను సక్రమంగానే నిర్వహించాడు.

చివరకు అభ్యంగనాలు గూడా ముగిశాయి. పట్టు పంచ గట్టుకుని, నడుముకు ఉత్తరీయం బిగించిన పురోహితుడు ముక్కాలి పీటపైన కలశ స్థాపనచేసి వివాహ కార్యక్రమానికి నాంది వాచకాలు చదువుతున్నాడు. రాత్రంతా నిద్రలేక స్వల్పంగా ఎరుపెక్కిన కళ్ళతో శేషాద్రి పెళ్ళి పీటపైన కూర్చున్నాడు. సందడి చేయవలసిన కుర్రకారంతా నిద్రలో ఉండడం వలన పందిరి కింద వాతావరణం ప్రశాంతంగా ఉంది. నిరీక్షణా ప్రబంధంలో అంతిమాశ్వాసంలో ఉన్న శేషాద్రికి జరుగుతున్న ప్రతిక్షణమూ తన

ఓర్పును పరీక్షిస్తున్న మహా యుగంలానే భాసిస్తోంది.

తన వంచుకుని కూర్చున్నాడు శేషాద్రి. పందిరిలో ఏ వైపు నుంచో గాని మనుషులు లేస్తున్నట్టు, లేచి ఎవరికో దారి ఇస్తున్నట్టు సన్నగా అలికిడి వినవచ్చిందతనికి! తటాలున తల పైకెత్తాడు శేషాద్రి. ముత్తయిదువ ఒకర్తు దారి జూపుతుండగా, కన్నెపడుచు ఒక్కతె ముందుకు నడిపిస్తుండగా పెళ్ళికూతురు మెల్లమెల్లగా పీటలవైపు సాగివస్తోంది.

ఒకటి... రెండు.... మూడు.... శేషాద్రికి ఆ మూడు క్షణాల పాటటు అనిమిషత్వం సిద్ధించింది.

ఆమె పొడుగరి కాదు. అలాగని పొట్టిగా, బొద్దుగా లేదు. రెపరెపలాడుతున్న పట్టుచీరలో ఆమె ఉత్సవానికి బయల్దేరిన దేవీ విగ్రహం లా ఉంది. శరీరఛ్ఛాయ అచ్చమైన ఎరుపు గాదు. గులాబీ రేకుకు మల్లె తెలుపు కలిసిన ఎరుపు. కాటుక రేఖల మధ్య అరవిచ్చుకున్న కలువ పువ్వుల్లాంటి కళ్ళు. ఆ కళ్ళల్లో ప్రపంచమంటే ఏమిటో ఈమెకు తెలియదేమోననిపించే అమాయకత్వం! శేషాద్రి ఆశ్చర్యపడ్డాడు - లోకజ్ఞతకు కాణాచి లాంటి తన తల్లి ఏమి చూచి ఈమెను తన కోడలుగా వరించింది?

శేషాద్రి జాలిపడ్డాడు కూడా! ఈ అమ్మాయిని గనుక యింతకు మునుపే చూచి వుంటే తనీ పెళ్ళికి సమ్మతించేవాడు కాడేమో! అందం చాలక కాదు! అద్దాల బీరువాలో పదిలంగా ఉంచుకుని కనుల విందుగా చూచి ఆనందింపదగిన అందమైన వస్తువును నేలపైకి గిరవాటెట్టడం తనకు మనస్కరించదు. బొమ్మ పెండ్లిండ్లకు పోనొల్లనని బిడియపడే బాల ఎక్కడ? రణరంగమెక్కడ? స్నిగ్ధ సుందరమైన ఈ లావణ్యం గృహకృత్యాల అలజడిలో బడలిపోవడం తను చూడలేదు. అంతగా కాదూ కూడదీ అమ్మాయినే చేపట్టాలని తల్లితోబాటు తన హృదయం కూడా పట్టుబట్టి వుంటే అప్పుడు సైతం తను తొందరపడేవాడు కాదు. నాలుగేల్లపాటు ఓపిక పట్టమని నచ్చచెప్పి - ఆవ్యవధిలో కుటుంబ జీవితానికి సంబంధించిన పాఠాలను శ్రద్ధగా అధ్యయనం చేయవలసిందని తనే అమ్మాయికి సలహా యిప్పించి వుండేవాడు!

ఆకుల గుబుర్లలో అణగి మణగి వున్న పుష్పగుచ్ఛంలా పెళ్ళి కూతురు పీటపైన ఒదిగి కూర్చుంది. శేషాద్రి ఓరకంటి చూపులు బారులు కట్టిన తుమ్మెదలై ఆ కన్నెపడుచు ముఖ సౌందర్యాన్ని గ్రోలడానికి ఉరకలు వేస్తున్నాయి. శేషాద్రి తనలో తానే నవ్వుకున్నాడు - పెద్దలు చెప్పడానికేమి? వాళ్ళు పెక్కు సూక్తులను నొక్కి వక్కాణించారు. వాటిలో రూపం కన్నా గుణం ప్రధానమన్నది ఒకటి! కానీ ముమ్మందుగా కళ్ల ఎదుట ప్రత్యక్షమయ్యే రూపాన్ని గురించి పట్టించుకోకపోవడం మానవుడి స్వభావం కాదు. మాటా పాటా, నవ్వూ నడకా, సిగ్గూ, చిరుకోపమూ లాంటి వెయ్యి హంగులున్నాయి రూపానికి! ఇన్ని దారాలు పెనవేసి పేనిన త్రాళ్ళతో వూగే శృంగార డోల రూప సౌందర్యం!

కానీ సృష్టిలో అందమైన ప్రతిదీ అభిలషింపదగినదిగా వుండడం లేదు. చూపులకే గాని మేపులకు పనికిరాని పళ్ళెన్ని లేవు! కళ్లకు కమనీయంగా కనిపించి, దగ్గరికి రాగానే ముక్కులు మూసుకోవలసిన పువ్వులెన్ని లేవు! వెయ్యి రేకుల జలజానికున్న అందంతో పోల్చి చూస్తే, మల్లెమొగ్గ ఏపాటిది? ఐతేనేం; మల్లెమొగ్గ కమ్మని తావికి కాణాచి. డాంబిక ప్రవృత్తికి నిలయం లాంటి తామరపువ్వును తలలో పెట్టుకునేవారు లేరు. పూజావిధులకది సుతరామూ పనికిరాదు. తరుణులు తలదాల్చడానికైనా, పరమేశ్వరుడి పాదసేవకైనా వుపకరిస్తున్నవి నిరాడంబరతకు, వినమ్రతకు నెలవులైన మల్లెమొగ్గలే! అందుకే మరి, అందచందాల కంటే ఆత్మ సౌందర్యం ముఖ్యమంటారు.

గొలుసుకట్టులా సాగిపోతున్న శేషాద్రి ఆలోచనా స్రవంతి యిక్కడ మలుపు తిరిగింది. తనను

పెళ్ళికొడుకును చేసి సాగనంపుతూ కళ్ళనీళ్ళు పెట్టుకున్న తల్లి ఆకృతి అతడి మనో ఫలకంపై నిలిచింది. కుమారుడి పెళ్ళి తల్లికి ఆనంద హేతువు. ఐతే మంచి సంగీతంలో అపశ్రుతిలా ఈ కన్నీరెందుకు? బహుశా కారణం ఒకటిగావచ్చు - కుమారుడి పెళ్ళి కావడమంటే అతడి పట్ల తనకున్న బాధ్యతలు పెక్కింటిని తల్లి కోడలికి అప్పజెప్పడమన్నమాట! ఆ బాధ్యతల్ని కోడలు ఎంతవరకూ సక్రమంగా నిర్వర్తించగలదన్న ప్రశ్నకు కాలమే జవాబు తేల్చి చెప్పవలసి ఉంటుంది. ఈ విషయానికి సంబంధించి లోకులు ఒక మాట చెబుతుంటారు. భర్త ఇంటికి తిరిగి రాగానే పెళ్ళాం వీపు చూస్తుందట! అదే తల్లి అయితే కుమారుని కడుపు చూస్తుందట! భార్య కన్నెప్పుడు భర్త సంపాదన మీద! తల్లికి అనుక్షణమూ కుమారుడి అవసరాల పట్ల ధ్యాస. తల్లి కుమారుడు సంతోషంగా వున్నాడా, లేదా అని గమనిస్తుంది. భార్య భర్త తనను సంతోష పెడుతున్నాడా లేదా అని వితర్కిస్తుంది, 'కార్యేషు దాసి, కరణేషు మంత్రీ - అంటూ భర్తృహరి సహధర్మిణి కుండవలసిన గుణాలను ఏకరువు పెట్టాడు. ఆ లక్షణాలను మననం చేసుకున్నప్పుడు అనుకూల దాంపత్యం భగవంతుడు ప్రసాదించవలసిన వరమనిపిస్తుంది!

శేషాద్రి పరధ్యానంలో ఉండగానే పురోహితుడు ఆచారాలన్నింటినీ సాంగోపాంగంగా నిర్వర్తించి ముహూర్త మేళం కానివ్వమని కేకపెట్టాడు.

★ ★ ★

అప్రస్తుతమైన పరామర్శలతోను, అసందర్భమైన హాస్యాలతోను, అయాచితమైన గౌరవాలతోనూ విసుగెత్తిపోయిన శేషాద్రి ఆరోజు సాయంత్రం కాస్త స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోడానికి వీలుగా వూరికి దూరంగా పారిపోయాడు. ఆందోళనలకు, గందరగోళాలకు ఆలవాలమైన శబ్ద ప్రపంచానికి దూరమైన కొద్దీ శేషాద్రి మనసుకు శాంతి లభిస్తోంది. శాంతము లేక సౌఖ్యము లేదంటాడు త్యాగరాజు, శాంతం ఆయనకు సంగీతం ద్వారా లభ్యమైంది. తనకు ఏకాంతంలో లభ్యమవుతుందేమో! - నడుస్తూ నడుస్తూ ఆలోచనలో పడ్డాడు శేషాద్రి.... అదేం విచిత్రమో గానీ, ఈ వ్యావహారిక జగత్తులో ఎలాంటి అమందానందంలోనైనా సరే, ఒక ఆవేదన అంతర్లీనమై వున్నట్టుంది. సంబరాలన్నింటికీ తలమానికమైన సంబరం వివాహం. సృష్ట్యాది నుంచీ పరిణతి నందుతూ వచ్చిన మానవ నాగరికతలో చెప్పుకోదగ్గ గొప్ప మజిలీ వివాహం. మూడు మాసాల నాడు తనకు వివాహం నిశ్చయమైంది. ఆనాటి నుండీ తన హృదయం కడుపు నిండుకూ కొత్త నీటిని పెట్టుకున్న చెరువులా తెలియని ఆనందంతో దబ్బకలెత్తి పోతూనే వుంది. అప్పుడప్పుడూ మానవాకాశంలో తటిల్లతలా మెరసి మాయమైపోతూ వచ్చిన తన ఊహా సుందరి విస్పష్టమైన రూపాన్ని ధరించి తనకోసం వేచి చూస్తోందన్న భావన మదిలో మెదలిన ప్రతిసారీ హృదయ వీణపైన ఆనంద భైరవి రవళించినట్లు తను పరవశుడై పోయాడు. ఆ పరవశత్వం వెనుక మళ్ళీ కొన్ని సందేహాలు - తన జీవితాన్ని పంచుకోనున్న ఆ అమ్మాయి ఎలాంటిది? ఎలా వుంటుంది? తల్లి ఆమెను ముత్తె మంటుంది. పగడ మంటుంది. చిదిమి దీపం పెట్టవచ్చునంటుంది. స్వరూపాన్ని కళ్ళ ఎదుట నిలపదు గానీ ఆ వర్ణన పండుగనాటికి గానీ చేతికి రాబోని తినుబండారంలా మనసును వూరిస్తుంది.

అసలు వేచి వుండడంలోనే మోదమూ ఖేదమూ పాలూ, నీరులా కలిసి వున్నాయేమో! సమాగమాన్ని గురించి తలచుకున్న కొద్దీ మోదం, ఆలస్యమనిపించిన కొద్దీ ఖేదం.

ఎలాగైతేనేం, మూడు మాసాల వ్యవధి ముగింపుకు వచ్చింది.

ఐతే తన గ్రహచారం మాత్రం తనపట్ల వక్రించింది.

ఆవిడ నవ్వితే తనిప్పుడు ముత్యాలు ఏరుకోకూడదు! ఆవిడ పెదవి కదిపితే ఆ మాటల

మకరందాన్ని ఆస్వాదించ గూడదట! ఆ మంచిరోజు కోసం తనింకా నాలుగు రోజులు వేచి వుండాలని ఆంక్ష విధించారు పెద్దలు!

సంధ్యా సౌందర్యాన్ని విలోకిస్తూ ఏటి యిసుక తిన్నెపైన కూర్చున్నాడు శేషాద్రి. ఆకసంలో మబ్బులు, గాలిలో పక్షులు, నీటి పాయలో చేపలు జంటలు జంటలుగా పరుగెడుతున్నాయి. శేషాద్రి కళ్ళు మూసుకున్నాడు. ఏటి ప్రక్కన చెట్ల గుబురులో నుంచి క్రొత్తగా జత కట్టిన కోయిల ఒకటి రసాలకిసలయంతో పదునెక్కిన పంచమస్వరంతో తన ప్రియురాలిని పిలుస్తోంది. శేషాద్రి చెవులు మూసుకున్నాడు.

శేషాద్రి మళ్ళీ కళ్ళు తెరిచి చూసేసరికి కొండలపైన నడయాడే పొగమబ్బుల్లా వెన్నెల వెలుగులు సందె చీకట్లోకి వ్యాపిస్తున్నాయి.

ఊళ్ళోకి తిరిగి వస్తూ మార్గ మధ్యంలో దారి తప్పాడు శేషాద్రి. లేత వెన్నెల్లో పొలాల గట్ల వెంబడి తిరిగి ఏవో కొండ గుర్తుల మూలంగా మళ్లీ దారిలోబడి అతడిల్లు చేరుకునేసరికి రాత్రి తొమ్మిది గంటలైంది. ఆపాటికి మగపెళ్లివాళ్లందరూ భోజనాలు ముగించి తమకోసం ప్రత్యేకించిన విడిదికి వెళ్లిపోయారు. సాయంత్రం అయిదు గంటల నుండీ కంటికి కనిపించకుండా వెళ్లిపోయిన పెళ్ళికుమారుడి కోసం వూరు వూరంతా గాలించిన ఆడపెళ్ళివారికి అతడి పునర్దర్శనం లభించగానే ప్రాణాలు లేచి వచ్చాయి. బహుశా ఏదో నిరాదరణ జరిగి ఉంటుందనీ, అందుపైన అలక సాధించడానికని పెళ్ళి కుమారుడిలా మాయమై వుంటాడనీ వూహాగానం చేసుకున్న ఆడపెళ్ళివారు, శేషాద్రి కనిపించగానే రెట్టింపు మోతాదులో వినయాలు ప్రదర్శింప సాగారు. ఈ తెచ్చికోలు వినయాల తాకిడికి తట్టుకోలేకపోయాడు శేషాద్రి. ఖాద్య పదార్థాలన్నింటినీ ఆకులోనే వదిలిపెట్టి, తొందర తొందరగా తిన్న శాస్త్రం ముగించి పైకి లేచాడు, అల్లుడికి కోపం వచ్చిందని అవతలి వాళ్ళు భావించడానికి అతడు భోజనం చేసిన పద్ధతి కూడా కొంతవరకూ సహకరించింది.

"ఎక్కడ పడుకుంటావు బావా?" అన్నాడు బావమరిది.

"ఎక్కడైనా సరే, కానీ కొన్ని షరతులున్నాయి. మనుషులు మాటాడుతుంటే నాకు కన్ను మూత పడదు. చీమ చిటుక్కుమంటే మెలకువ వస్తుంది. గాలి బాగా వీస్తుండాలి. నాకు తెలిసినంతలో వసారాలో మంచం వేయిస్తే బాగుంటుంది..." అన్నాడు శేషాద్రి.

"అబ్బే, మా వూళ్లో చలి ఎక్కువ బావా!నువ్వు నిభాయించుకోలేవు. పైగా..."

బావమరిది మాటకు అడ్డు తగిలి "పరవాలేదు లేవోయ్! నీకెందుకూ, నేనెలాగో సర్దుకుంటానులే' ' అన్నాడు చిరాకుగా శేషాద్రి.

రెండు మూడు రాత్రులుగా నిద్రలేని కారణం వల్ల పడుకోగానే నిద్రపట్టవచ్చుననుకున్నాడు శేషాద్రి. ఆ ఆశ అడియాసే అయింది. బావమరిది మాటను బలపరుస్తూ చలిగాలిజోరుగా వీస్తోంది. అందుకు తోడుగా దోమల సంరంభం కూడా ఉధృతంగా ఉంది. శేషాద్రి దుప్పటి కోసం పడకవైపు తడివి చూశాడు. తలగడను పైకెత్తి చూచాడు. మంచం పైన పరుపు మాత్రం ఉంది. దుప్పటి లేదు.

శేషాద్రికా క్షణాన నిజంగానే కోపం వచ్చింది.

ముసుగు బిగదన్నుకోకపోతే తనకు నిద్రపట్టదు. ఈరాత్రికిక తనకు నిద్రపట్టే యోగం వ్రాసిపెట్టలేదేమో! లేకుంటే తనపట్ల మితిమీరిన పరామరిక చూపెడుతున్న ఆడపెళ్ళివారు దుప్పటి విషయం యెందుకు విస్మరిస్తారు?

మడతలు విప్పి అంగ వస్త్రాన్ని కప్పుకోడానికి ప్రయత్నించాడు శేషాద్రి. కానీ అది ఆపాదమస్తకానికీ చాలడం లేదు. పాదాలపైకి లాక్కుంటే తల బయట వుండిపోతుంది. తల పైకి తీసుకుంటే పాదాలు బయట ఉండిపోతాయి.

ఇక చేసేది లేక కాళ్ళనుకడుపులోకి తీసుకుని చేతుల్ని రొమ్ముపైన దాచుకుని, మాతృగర్భస్థ శిశువులా మంచంపైన ముడుచుకు పోయాడు శేషాద్రి.

కాలం మెల్లగా దొర్లిపోతూంది.

శేషాద్రికి మాగన్నుగా నిద్రపట్టింది కూడా!

మగత నిద్రలో నుంచీ ఉలికి పడిన వాడిలా వున్నట్టుండి మేలుకున్నాడు శేషాద్రి. శరీరం పైన ఏదో మెత్తని వస్తువు పరుచుకుంటున్నట్టు ఓ స్పృహ కలిగిందతనికి! విప్పారిన శేషాద్రి కళ్ళకు అంగవస్త్రపు పొరలో నుంచీ మంచం దాపున ఓ ఆకారం నిల్చుని వున్నట్లు లీలగా భాసించింది. ముఖం పై నుంచి బట్టను తొలగించడానికి అతడి చేతులు కదిలాయో లేదో, ఆ చలనాన్ని పసిగట్టి తన చేతుల్లోని శాలువా అంచుల్ని అలాగే శేషాద్రిపైకి వదిలిపెట్టి మంచం దాపున నిల్చున్న ఆకారం చీకటిలోకి జారిపోసాగింది. శేషాద్రి తటాలున చేయిసాచి ఆ ఆకృతిని ఒడిసి దగ్గరికి లాక్కోబోయాడు.

కానీ అప్పటికే ఆ నీడలాంటి ఆకారం చేయి దాటిపోయింది. శేషాద్రి చేతికి జడ మాత్రం దొరికింది. ఆ జడకూడా ఒకటి రెండు క్షణాలు గిలగిలలాడి చేతి వ్రేళ్ళ మధ్య నుంచీ జారిపోయింది. జడ పొడుగునా గ్రుచ్చుకున్న చేమంతుల్లో నాలుగు పువ్వులు మాత్రం శేషాద్రికి దక్కాయి.

అరచేతిలో విరిసి నవ్వుతున్న చేమంతుల్ని చూస్తున్నాడు శేషాద్రి. చేమంతులు కావు - ఇవి నవజీవనానందానికి చిహ్నాలు! పవిత్రమైన అనురాగ బంధానికి సాక్ష్యాలు. మనసిచ్చి మనసు పుచ్చుకోగల అర్ధాంగి కోసం వరపడగా, భగవంతుడు తనకిచ్చిన వరాలు!

చేమంతిపువ్వుల కమ్మని తావిలో తన్మయుడౌతూ, వెచ్చని శాలువా క్రింద ఒళ్ళు విరుచుకున్నాడు శేషాద్రి.

*(ఆంధ్ర సచిత్ర వారపత్రిక 1957)*